# జాజిమల్లె... నువ్వు జ్ఞాపకమొస్తే...

విశారద

''సారీ ఉషా! కాస్త లేటైంది. రెడీగా ఉన్నావా? వెళ్దామా?'' లోపలికొస్తూనే అన్నాడు మనోహర్.

''కాస్త లేటా? అరగంట లేటు. ఎప్పుడూ ఇంతే. చెప్పిన టైముకి రారు. అలాంటప్పుడు ముందే చెప్పడమెందుకు? నన్నిలా ఏడిపించడం ఏందుకు?'' విరుచుకుపడింది ఉష.

''ఎప్పుడూ ఇంతేనా? రెండుమూడుసార్లేకదా చెప్పిన టైముకి కాస్త లేటుగా వచ్చింది'' అనునయిస్తున్నట్టుగా అన్నాడు మనోహర్.

''రెండుమూడుసార్లో, వందసార్లో లెక్క పెట్టుకోవడమే నా పని'' గొంతు చించుకుని అరిచింది.

''ఆఫీసన్నాక కొన్ని బాధ్యతలుంటాయి. అనుకున్న టైముకి రావడం ఒక్కోసారి కుదరదు ఉషా'' ఆమెకు దగ్గరగా వచ్చి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు మనోహర్.

''అబ్బో...ఆఫీసు, ఉద్యోగం. మీరొక్కరే వెళ్తున్నారు ఆఫీసుకి. మీరొక్కరే చేస్తున్నారు ఉద్యోగం'' చేతులు తిప్పుతూ కోపంగా అంది ఉష.

''అనవసర మాటలెందుకు? సినిమాకి ఇంకా టైముంది. వస్తూనే టిక్కెట్లు తెచ్చేసాను. పద వెళ్దాం'' కోపాన్ని కంట్రోల్ చేసుకుంటూ శాంతంగా అన్నాడు మనోహర్.

మనోహర్ చేతిలో వున్న టిక్కెట్లు విసురుగా అందుకుని పరపరా చింపిపారేసింది ఉష.

''నా మొహానికి సినిమా ఒక్కటే తక్కువైంది'' విసవిసా నడుస్తూ బెడ్రూమ్‌లోకి వెళ్లి తలుపులు భళ్ళున మూసింది.

మనోహర్ నిర్లిప్తంగా చూస్తూ వుండిపోయాడు.

తెల్లారిలేస్తే ఇలాంటి సంఘటనలు ఒకటా, రెండా? మనసుని ముల్లులా గుచ్చుతూ, గాయపరుస్తూ...

ఎందుకిలా చేస్తుంది ఉష?

చిన్న చిన్న విషయాలకింత రాద్ధాంతం చేయాలా? తనేమైనా బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాడా? అర్థం చేసుకోదెందుకు?

ఎప్పుడో ఒకసారి చెప్పిన టైముకి కాస్త లేటుగా వస్తే ఇక గొడవే. ఎంత ఓపిగ్గా నచ్చచెప్పాలని చూసినా చెప్పేది వినిపించుకోదు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నించదు.

పెళ్లయి రెండేళ్ళు కాలేదు. జీవితం అప్పుడే ఇంత బరువుగా, బాధగా ఉంటే ముందు జీవితం మాటేమిటి? ఇక జీవితాంతం ఇంతేనా? ఆమె మారదా? తన వైఖరి మార్చుకోదా?

అతనికెందుకో నిస్సత్తువగా, నిస్పృహగా అనిపించింది.

అతని చూపులు ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నాయి.

అయినా స్మృతిపథంలో ఓ సంఘటన తళుక్కున మెరిసింది. కళ్ళముందు ఓ అందమైన జ్ఞాపకం అపురూపంగా కదిలింది.

• • •

''సారీరా లేటైంది'' హడావుడిగా లోపలికొస్తూ అన్నాడతను.

ఆమె నవ్వింది.

''సినిమా మొదలైతే అయింది పద వెళ్దాం'' తొందరపెట్టాడు.

''ఏ కొంప మునిగిపోలేదు. సినిమాకి రేపు వెళ్ళొచ్చు'' అతనికి మంచినీళ్లు అందిస్తూ అంది ఆమె.

''అదికాదు ప్రొద్దునే వెళ్తూ చెప్పానుకదా సాయంత్రం సినిమాకి వెళ్దామని...''

''ఆఫీసునుంచి వచ్చీ రాగానే ఏం సినిమా? ఇంకోసారి వెళ్లొచ్చులే. ఫ్రెషప్ అయి రండి. లాన్స్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. ఈ రోజు మీ కోసం ఓ స్పెషల్ చేసాను. టేస్ట్ చూసి ఎలా వుందో చెప్పాలి'' అతని చెయ్యి పట్టి లోపలకు తీసుకువెళ్తూ అంది ఆమె.

అతను నవ్వుతూ ఆమెను అనుసరించాడు.

• • •

వంటింట్లోంచి వినబడుతున్న ధనధనమనే చప్పుళ్ళు అతని జ్ఞాపకాల్ని చెదరగొట్టాయి. మనోహర్ అయిష్టంగానే ఈ లోకంలోకి వచ్చాడు.

అయినా మనసు పొరల్లోంచి వెలికి వచ్చిన ఆ జ్ఞాపకం గుండె గుమ్మంలో అపురూపంగా పరుచుకునే వుంది.

అతనికెందుకో ఒక్కసారిగా దుఃఖం వచ్చింది.

ఒక అందమైన దృశ్యాన్ని ఆనందంగా, ఆహ్లాదంగా చూస్తున్నాడని అనుకున్నాడేగానీ తన నిర్లిప్త, నీరవ, నిరామయ బ్రతుకుని ఆమె ఒక జ్ఞాపకమై అలరిస్తుందని ఆ రోజుల్లో ఊహించనైనా ఊహించలేదు.

అర్ధరాత్రి అడక్కుండా వచ్చే కలలు తెల్లారేసరికి నిశ్శబ్దంగా జారుకుంటాయి.

అలాగే కొన్ని దృశ్యాలు, కొన్ని సంఘటనలు, కొంత మంది వ్యక్తులు ఎన్నో...ఇంకెన్నో జ్ఞాపకాల్లో మిగలకుండా జారిపోతుంటాయి. చాలా కొన్ని మాత్రం వెంటాడుతూ మనసులో తిష్ట వేస్తాయి.

''ఆమె...''

ఓ అద్భుతం, ఓ అపురూపం.

ఆమె జ్ఞాపకం మనసులోకి రావడమే ఓ దివ్యానుభూతి.

సాయంత్రపు నీరెండ, చల్లగాలి, చిరుజల్లు, హరివిల్లు కలసి వస్తే ఎలా వుంటుందో అచ్చంగా ఆమె అలా వుండేది.

హాస్టల్లో చదువుకోవడానికి కుదరడంలేదని, అప్పట్లో తను తెలిసిన వాళ్లింట్లో ఒక రూమ్‌లో అద్దెకు ఉండేవాడు.

పక్కనే వాళ్లిల్లు.

ఆమె, అతను, పాప ఎంత ముచ్చటగా వుండేదో వాళ్ళ సంసారం. తనది మేడమీది గది కావడంతో పక్కనే వాళ్లిల్లు స్పష్టంగా కనిపించేది. పొందిగ్గా, ఒక పద్ధతిగా సాగే ఆమె దినచర్యని తను ఆశ్చర్యంగా గమనించేవాడు.

అతను ఆఫీసుకెళ్ళేటప్పుడు సాగనంపే దృశ్యం, తిరిగి ఇంటికి వచ్చినప్పుడు రిసీవ్ చేసుకునే దృశ్యం చాలా అపురూపంగా వుండేది. సంపెంగలా చిరునవ్వుతో అతనికి ఎదురొచ్చేది. ఎంత బావుండేదో ఆ దృశ్యం.

ఆ సీన్ మిస్ అవకూడదని తను ఆ టైమ్‌కి ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు. వాళ్ళ అన్యోన్యత చూడ్డానికి ఈ రెండు కళ్ళు సరిపోతాయా...వెయ్యి కళ్ళు కావాలి అనిపించేది.

అతను ఆఫీసునుండి వచ్చాక వెళ్తే ముగ్గురూ కలసి ఎక్కడికైనా వెళ్లడమో, లేక ఇంటి ముందు గార్డెన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకోవడమో చేసే వాళ్ళు.

'సృష్టికి ఎంత లోపమో ఇలాంటి జంటలు లేక పోతే' అనిపించేది తనకెప్పుడూ.

ఒక స్త్రీ ఒక పురుషుడ్ని పరిపూర్ణంగా అవగాహన చేసుకుని కాపురం చేయడంలోని అందం, ఆనందం ఎలాంటిదో తనకప్పుడే తెలిసాయి.

వాళ్ళనలా నాలుగేళ్ళపాటు చూసీ చూసీ పెళ్లిమీద, పెళ్లి తరువాత జీవితం మీదా తనకి తెలియకుండానే తనలో ఒక కల కమనీయంగా రూపుదిద్దుకుంది.

జీవిత భాగస్వామి గురించి ఎన్ని ఊహలు...ఎన్ని కలలు.

అప్పుడలా చిగురేసిన కలలు ఇప్పుడిలా ఛిద్రం అవుతాయని కలనైనా ఊహించని విషయం.

''భోజనానికి దయచేస్తారా?'' వంటింట్లోంచి ఓ గావుకేక.

మనోహర్ ఉలికిపాటుగా ఈ లోకంలోకి వచ్చాడు.

''వస్తున్నారా లేదా?'' మరో గావుకేక.

''అరుపులు, రంకెలు తప్ప ఈమెకి సౌమ్యంగా మాట్లాడ్డమే రాదేమో?'' నిట్టూరుస్తూ వాష్ బేసిన్ దగ్గరకెళ్లి చెయ్యి కడుక్కున్నాడు.

ఉష విసురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది. మనోహర్ ఈమెకెదురుగా మరో కుర్చీలో మౌనంగా కూర్చుని భోజనం చేస్తున్నాడు.

''సినిమాలు, షికార్లు లేకపోతే లేకపోయె. పెళ్లాంతో సరదాగా మాట్లాడ్డం కూడా లేదు. బైటకి తీసుకెళ్లడానికి సరే టైములేదు. మాట్లాడ్డానికి కూడా టైము లేదు కాబోలు'' చురచురా చూసింది ఉష.

''నువ్వలా కోపంగా, రుసరులలాడుతూ వుంటే ఎలా మాట్లాడాలనిపిస్తుంది ఉషా!'' సౌమ్యంగా అన్నాడు మనోహర్.

అతని మాటలకి ఉష రెచ్చిపోయినట్లుగా చూసింది, కోపంతో మండిపడింది.

''అంటే...నేనెప్పుడూ కోపంగా, రుసరుసలాడుతూ వుంటానని మీ ఉద్దేశ్యమా? మీరు శాంతస్వభావులు, నేనో రాక్షసిని, గయ్యాళినని మీ అభిప్రాయమా? అంతా నా ఖర్మ. నా ఖర్మకాలి మిమ్మల్ని కట్టుకున్నాను. సుఖపడే యోగం ఆ భగవంతుడు నాకివ్వలేదు. ఇస్తే మీ పాలెందుకు పడతాను? దర్జాగా, ఎక్కడో...''

మనోహర్ హఠాత్తుగా ప్లేట్‌లో చెయ్యి కడుక్కుని లేచాడు.

''ఇప్పుడు నేనేమన్నానని భోంచేయకుండా మధ్యలో లేవడం? చేసేదంతా చేసి నాచేత అరిపించి నా నోరు బైటపడేలా చేస్తారు. తప్పంతా మీలో పెట్టుకుని నన్నంటారు. మాటా మంచీ లేకుండా మీ మౌనంతో నన్ను సాధిస్తారు''



ఉష గట్టిగా అరిచింది.

''నిజమే ఉషా! తప్పంతా నాదే'' మనోహర్ ఆమె వైపు నిర్లిప్తంగా చూసాడు.

''ఆహా... ఎంత చక్కగా ఒప్పుకున్నారు? అందులో వెక్కిరింత నాకర్థం కాదనుకున్నారా?'' ఉక్రోషంతో అందామె.

మనోహర్ సమాధానం చెప్పలేదు. మౌనంగా అక్కడి నుండి కదిలాడు. డాబా మీదకి వెళ్లి పైకి పాకిన జాజితీగ పక్కగా నిలుచున్నాడు.

అప్పుడే విచ్చుకున్న జాజిపూలు వెదజల్లుతున్న సువాసనలు, సన్నగా వీస్తున్న చిరుగాలి, పొగకాస్తున్న వెన్నెల జ్ఞాపకాల వాకిళ్ళను మెల్లగా తెరిచాయి.

ఆమె... అతను, వాళ్ళ ముచ్చటైన కాపురం, ఎంత ముచ్చటగా వుండేది.

అది ఏ కొద్దిమందికో మాత్రమే దక్కుతుందేమో! భార్యాభర్తల మధ్య అవగాహన, అనురాగం లోపిస్తే ఆ కాపురం ఎంత నరకప్రాయం? ఈ మనుషులకెందుకు కనీస ఇంగితం, అవగాహన వుండవు?

అపార్థాలతో, మూర్ఖత్వంతో, బాధ్యతారాహిత్యంతో తమ జీవితాన్ని నరకం చేసుకోవడమేకాదు, ఎదుటి వారి జీవితాన్ని కూడా నరకప్రాయం చేసేస్తారు.

ఎదుటి మనిషిని అర్థం చేసుకుని ఆత్మీయతతో, బాధ్యతతో మెలగడం చేతగాని స్త్రీకిగానీ, పురుషుడికిగానీ అసలు పెళ్లి చేసుకునే అర్హత వుందా?

''కాళ్ళు తడవకుండా సముద్రాన్ని దాటగల మేధావి అయినా, కళ్ళు తడవకుండా జీవితాన్ని దాటలేడు'' అంటాడు కవి వసీరా.

జీవితం సముద్రం లాంటిదైతే ఈ జీవితాన్ని దాటేందుకు హృదయానికి ఆర్ద్రత కావాలి. దుఃఖాన్ని సహించే శక్తి కావాలి. ఆ శక్తి భార్యాభర్తలకి ఒకరి నుండి మరొకరికి అందాలి. అప్పుడేకదా జీవితంలో 'జీవించడం' వుంటుంది.

''ఇక్కడ నిలబడి మీరు చేస్తున్న పని ఇదన్న మాట!''

మనోహర్ చప్పున తల పక్కికి తిప్పి చూసాడు.

ఉష తననే తీక్షణంగాచూస్తూ నిలబడి ఉంది. అతనికి ఆమె మాటల అర్థం తెలియలేదు. అయోమయంగా ఉష వైపు చూసాడు.

''ఎంత అమాయకత్వం నటిస్తున్నారు? ఎదురింటి అమ్మాయిని చూస్తూ నిలబడి ఏమీ ఎరగనట్టు ఫోజొకటి మళ్లీ...''

ఆమె మాటలు వింటూంటే మనోహర్ ఎదురింటి వైపు చూసాడు. అక్కడ బాల్కనీలో ఓ అమ్మాయి కూర్చుని చదువుకుంటోంది.

''నాకెందుకు అలాంటి ఆలోచనలు వస్తాయి? ఆ అమ్మాయిని నేను ఇందాకటినుండీ గమనించనేలేదు తెలుసా? ఇప్పుడే చూస్తున్నాను. అదీ నువ్వు చెప్పాక...'' పళ్ళు బిగువున కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు మనోహర్.

''చేసేదంతా చేసేస్తూ పైగా నా ఆలోచనలు మంచివి కాదంటారా? ఎప్పుడూ అంతే. నన్ను విమర్శించడమే పని'' ఉష గొంతు పెంచింది.

''ష్...ఏమిటా అరవడం? పక్క ఇళ్ళవాళ్ళు వింటారు. ఇది పద్ధతికాదు. ఉషా నువ్వు చాలా మారాలి'' శాంతంగా అన్నాడతను.

''నేను కాదు మారాల్సింది మీరు'' గొంతు చించుకుని అరుస్తూనే ఉష అక్కడినుంచి వడివడిగా వెళ్లిపోయింది.

మనోహర్ నిర్లిప్తంగా నవ్వుకున్నాడు.

ప్రతివాళ్ళూ పెళ్ళి గురించి రంగురంగుల కలలు కంటారు. ఆ కలల్ని నిజం చేసుకునేందుకు తమ బాధ్యత వుంటుందని మాత్రం తెలుసుకోరు.

పెళ్ళయిన కొత్తల్లో వున్న ఉత్సాహమూ, ఆహ్లాదమూ, చివరిదాకా కాపాడుకోవాలన్న ఆలోచన ఏ కొద్దిమందిలోగానీ వుండదేమో!

అందుకే కాబోలు ఆమె వ్యక్తిత్వం, నిర్మలత్వం తనని ఇంకా స్పృశిస్తూనే వుంది. అప్పట్లో ఆమెని చూసి తను ఎంతటి స్ఫూర్తిని, ఉత్తేజాన్ని పొందిందీ తనకింకా గుర్తే!

వాళ్ళ ముచ్చటైన కాపురాన్ని చూస్తుంటే తన కళ్ళ ముందో కమనీయమైన కల రూపుదిద్దుకుంది. ఎంత కాంప్టిపేటింగ్ కల అది.

ఏదీ ఇప్పుడా కల?

ఆనవాళ్ళయినా మిగలలేదే?

ఆ భగవంతుడు ప్రతి ఇల్లాలిని ఆమెలా ఎందుకు సృష్టించడు? ఒక అద్భుతాన్ని, ఒక అపురూపాన్ని పదేపదే సృష్టించరేమో? సృష్టిస్తే అది అపురూపం ఎలా అవుతుంది?

ఆమెలాంటి భార్య దొరకడం అందరికీ దక్కే వరమా అది?

కాదని ఇప్పుడే తెలుస్తోంది. ఇప్పుడు తెలుసుకుని ప్రయోజనం ఏముంది కనుక?

నిజానికి ఇప్పుడు ఉషకున్న ఫెసిలిటీస్‌గానీ, ఫైనాన్షియల్ స్టేటస్‌గానీ అప్పుడామెకు లేవు.

ఏం వున్నా లేకపోయినా నవ్వుతూ వుండేది. లేవన్న వెలితిగానీ, బాధగానీ ఆమె ముఖంలో కనిపించేవి కావు. ఏం చూసుకుని ఆ సంతృప్తి, ఆ సంతోషం? బహుశా సంతృప్తిని మించిన సంపద లేదేమో!

అందుకే మరి 'అపురూపం' అంటే ఏమిటో ఇప్పుడు పూర్తిగా తెలుస్తోంది. అపురూపానికి పూర్తి నిర్వచనం ఆమే.

అసలామెని ఇన్నిసార్లు గుర్తు చేసుకోవాల్సిన అవసరం వస్తుందని అప్పట్లో తననుకోలేదు. ఇప్పుడు రోజుకి ఎన్నిసార్లు గుర్తుకొస్తుందో లెక్క పెట్టలేడు.

ఆమెను తను జీవితంలో తిరిగి చూడవచ్చు, చూడలేకపోవచ్చు. ఆమె జ్ఞాపకం మాత్రం చలివేంద్రంలా మనసుని సేదదీరుస్తోంది.

ఎందుకు?

తెలియదు.

అమ్మ లాలి పాటలోని ఆర్ద్రత, అమ్మ ఒడిలోని వెచ్చదనం, ఆత్మీయతలోని కమ్మదనం అన్నీ...అన్నీ తనకా జ్ఞాపకాల్లోనే దొరుకుతాయి.

ఎందుకు?

తెలియదు.

ఆమె వ్యక్తిత్వం తాలూకు జ్ఞాపకాలు గుర్తుకు రావడానికి కారణాలు వెతుక్కోవడం ఓ మహత్తరమైన అనుభవాన్ని అవమానించడమేనేమో! జ్ఞాపకం రావడానికి కారణం అవసరంలేదు. బ్రతకడానికి జీవం అవసరమేమోగానీ...


వెన్నెల్లో అందంగా విచ్చి, పరిమళాలు వెదజల్లే జాజిమల్లె ఆమె. అందుకే ఆమె జ్ఞాపకాలకీ అన్ని పరిమళాలు.

ఈ హడావుడి జీవితంలో, ఈ పరుగుల్లో ఉష అవగాహనా రాహిత్యంలో, ఆవేదనలో, అలసటలో ''ఓ జాజిమల్లె నువ్వెందుకు గుర్తొస్తావు? గుండె మెలికపడేలా మనసు ఊరట పొందేలా.''

''వీధి చివర వెలుగుతున్న గుడ్డి దీపంలోని నమ్మకంలా.. నీ జ్ఞాపకం చాలదా నేను బ్రతకడానికీ, బ్రతకడానికో స్ఫూర్తినివ్వడానికీ!''

★

## సెక్స్ సామర్థ్యాన్ని పెంచే మరో ఔషధం



వయాగ్రా... ఇప్పటితరంలో ఈ పేరు చెవినపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. మగవాళ్లలో క్షీణించిన సెక్స్ సామర్థ్యాన్ని ఉద్దీపనం చేయడానికి ఇది దోహదం చేస్తుందనే విషయం తెలిసిందే. ఇలాంటిదే మరో మందును వచ్చే ఏడాది మార్కెట్లో ప్రవేశపెడుతున్నట్లు ఇటలీ ప్రకటించింది. 'ఇది వయాగ్రాలానే పని చేస్తుంది. ఎటువంటి సైడు ఎఫెక్టులు వుండవు. దాదాపు వంద మంది ప్రయోగించాక ఈ నిర్ధారణకొచ్చాం' అని చెప్పుకొచ్చారు రోమ్‌లోని యూనివర్శిటీ ప్రొఫెసర్ జియోనిస్పెరి. సెక్స్‌లో పాల్గొనే అరగంట ముందు ఇది వాడితే ఉజ్వలంగా ఫలితాలుంటాయన్నారు.

## ఒ.కే అన్నమాట ఇలా పుట్టింది

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువమంది ఉపయోగించే పదం ఓకే. అవతలి వ్యక్తి చెప్పిన అంశాలను అంగీకరించినప్పుడు సంభాషణలో ఈ పదాన్ని తరచూ ఉపయోగిస్తాము. తొలుత అమెరికానుంచి ఇది వ్యాప్తి చెందింది. జర్మనీ పౌరుడు దీనిని మొట్టమొదటసారి ఉపయోగించాడు. అదీ 1950 ప్రాంతంలో.

ఫోర్డ్ మోటారు కంపెనీలో పనికి కుదిరిన ఒట్టోక్రాజ్ 'క్వాలిటీ కంట్రోల్' విభాగంలో పని చేసేవాడు. కారు అసెంబ్లింగ్ అయిపోయిన తరువాత 'అన్నీ బాగున్నాయా' అని చెప్పడానికి తన పేరులో పొడి అక్షరాలను ఓ.కే అని రిజిస్టర్‌లో రాసేవాడు. అప్పట్నుంచి క్రమంగా జనాల్లోకి ఈ పదం వెళ్లిందని చెబుతారు.

-పల్లవి

